WWW.NTNEWS.COM
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 3 ఏప్రిల్ 2018

# రోడ్లు పాడైతే కఠిన చర్యలు

**మరమ్మతులు, నిర్వహణ కోసం ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం**

**వానాకాలంలో ప్రజలు ఇబ్బంది పడొద్దు**

**60 రోజుల ముందే వర్షాకాల ప్రణాళిక**

**జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందికి రెండు నెలలు సెలవులు రద్దు**

**రోడ్ల నిర్వహణపై సమీక్షలో మంత్రి కేటీఆర్**




ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, జలమండలి ఎండీ దానకిశోర్

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని రహదారులను సమర్థంగా నిర్వహించేందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారక రామారావు పేర్కొన్నారు. ఏటా వానాకాలంలో రోడ్లు పాడవుతున్నాయని, ఈసారి పునరావృతం కావొద్దని స్పష్టం చేశారు. నిధులతోపాటు సరిపడా సిబ్బందిని కేటాయిస్తున్నామని, ఈ వర్షాకాలంలో రోడ్ల నిర్వహణలో లోపాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంత్రి కేటీఆర్ సోమవారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజధానిలో రోడ్ల నిర్వహణ, మరమ్మతుల కోసం జీహెచ్ఎంసీకి ప్రతినెలా ప్రభుత్వం ప్రత్యేక నిధులను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పనుల పర్యవేక్షణ కోసం ఇప్పటికే ఒక్కో వార్డుకు ఒక్కో ఏఈ స్థాయి అధికారిని నియమించామని చెప్పారు. నిధులతోపాటు సరిపడా సిబ్బందిని ఇస్తున్న తర్వాత కూడా ఈ వర్షాకాలంలో రోడ్ల నిర్వహణలో లోపాలు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జోనల్ కమిషనర్లదే బాధ్యత..**

వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇలాంటి ప్రాంతాల గుర్తింపులో ట్రాఫిక్ పోలీసుల సూచనలను తీసుకొని, వారిని సమన్వయం చేసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. రానున్న అరవై రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. గత ఏడాది వర్షాలు కురిసినప్పుడు 181 నీళ్లు నిలిచే ప్రాంతాలు, 846 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని అధికారులు చెప్పగా.. ఆయా జోనల్ కమిషనర్లు ప్రత్యేక బాధ్యత తీసుకొని పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. వర్షాకాల ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ఇప్పటి నుంచే నిర్వహణ చర్యలు చేపట్టాలన్నారు. మెట్రో రైలు కారిడార్లు, హెచ్ఆర్‌డీసీ వంటి సంస్థల పరిధిలో ఉన్న రోడ్లకు సంబంధించి వారితో సమన్వయం చేసుకోవాలన్నారు. రానున్న రెండు నెలల్లో యుద్ధప్రాతిపదికన జరుగాలని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందికి వచ్చే రెండు నెలలు సెలవులను రద్దుచేసి, నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు.

**జలమండలి సమన్వయంతో మ్యాన్‌హోళ్ల నిర్వహణ**

పైపులైన్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు సంబంధించి జీహెచ్ఎంసీ, జలమండలి సమన్వయం చేసుకోవాలన్నారు. కాంట్రాక్టుల్లో పేర్కొన్న విధంగా పైపులైన్లతోపాటు సమాంతరంగా రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాన్‌హోళ్ల నిర్వహణపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, జలమండలి ఎండీ దానకిశోర్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.